ఆయిల్‌పామ్ సాగుపై ఆసక్తి

- తుంగతుర్తి మండలంలో 321.26 ఎకరాల్లో సాగు

తుంగతుర్తి : ఆయిల్ పామ్ పంట సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తుండటంతో మండలంలో రైతులు ఆయిల్ పామ్ సాగుకు ఆసక్తి చూపుతున్నారు. సంప్రదాయ పద్ధతిలో ఏళ్ల తరబడి ఒకే రకమైన పంటలు సాగుచేస్తూ నష్టాల పాలవుతున్న రైతులు కొత్త తరహా పంటల వైపు మొగ్గు చూపుతున్నారు. ఆయిల్ పామ్ సాగుపై ఉన్న సందేహాలను అధికారులు ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తుండడంతో రైతులకు మేలు జరుగుతోంది. రాయితీపై బిందు సేద్యం పరికరాలను సరఫరా చేయడం, మొక్క నాటిన నుంచి పంట కొనుగోలు వరకు అధికారులు భరోసా ఇస్తుండటంతో మండలంలో రైతులు ఇప్పటికే 321.26 ఎకరాల్లో ఆయిల్ పామ్ పంటలను


తుంగతుర్తిలో సాగులో ఉన్న ఆయిల్‌పామ్

సాగు చేస్తున్నారు. ఇప్పటికే మండలంలోని రైతులను ఖమ్మం, కొత్తగూడెం, అశ్వరావుపేట లాంటి ప్రాంతాలకు తీసుకెళ్లి ఆయిల్ పామ్ సాగుపై అవగాహన కల్పించారు. ఒక మొక్కకు రూ.193 అవుతుండగా ప్రభుత్వం సబ్సిడీపై రూ.20కే అందిస్తుంది. అలాగే ఎకరా ఆయిల్ పామ్ సాగుకు ఏడాదికి రూ.4,200 ప్రోత్సాహకంగా అందజేస్తోంది.

ఆయిల్ పామ్ సాగుతో ఉపయోగాలు..

ఏడాది వయసు ఉన్న ఆయిల్ పామ్ మొక్కలను రైతులకు ఇస్తారు. మొక్కలు నాటిన నాలుగో ఏడాది నుంచి కాపు మొదలవుతుంది. 30 ఏళ్ల పాటు ఈ పంట దిగుబడి వస్తుంది. మొదటి మూడేళ్లు అంతర్ పంటలుగా కూరగాయలు, వేరుశనగ వంటి పంటలను సాగు చేసుకోవచ్చు. ఆయిల్‌పామ్ పంటలకు తెగుళ్లు, చీడ పురుగులు, కోతుల బెడద ఉండదు. మొదటి సంవత్సరం ఎకరాకు ఆరు టన్నుల దిగుబడి వస్తుంది. అనంతరం ఎకరాకు రెండు టన్నుల దిగుబడి పెరుగుతుంది. ఇలా 30 సంవత్సరాల పాటు పంట దిగుబడి వస్తుంది. ప్రతి 15 నుంచి 20 రోజులకు ఒకసారి పంటను కోసుకోవచ్చు. ఆయిల్‌పామ్ ఎకరాకు చతురస్రాకారంలో 50 మొక్కలు, త్రికోణంలో 57 మొక్కలు నాటుకోవచ్చు.

రెండు ఎకరాల్లో సాగు చేస్తున్నా..

ఈ ఏడాది రెండు ఎకరాల్లో ఆయిల్ పామ్ పంటను సాగు చేస్తున్నాను. గతంలో వరి పంట సాగును ఎక్కువగా చేసేవాళ్లం. ఆశించిన లాభాలు రాక నష్టాలను చూశాం. ప్రభుత్వం ఆయిల్ పామ్ పంటల సాగుకు సబ్సిడీ ఇస్తూ ప్రోత్సహిస్తుండటంతో ప్రత్యామ్నాయ పంటలవైపు దృష్టి పెట్టాను.



- వగలగాని వీరయ్య, రైతు, కొత్తగూడెం

ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహిస్తున్నాం

ఆయిల్ పామ్ సాగుపై అవగాహన కల్పిస్తూ రైతులను ప్రోత్సహిస్తున్నాం. ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వం రాయితీ కలిస్తుంది. మండలంలో ఇప్పటి వరకు 321.26 ఎకరాల్లో ఆయిల్ పామ్ పంట సాగవుతుంది. రైతులు ఒకే రకమైన పంటలు కాకుండా ఆదాయానిచ్చే పంటలను సాగు చేసుకోవాలి.



- స్రవంతి, ఉద్యానవన శాఖ అధికారి, తుంగతుర్తి

మృతుల కుటుంబాలకు మంత్రి, ఎమ్మెల్యే పరామర్శ


నాగారంలో గుంటకండ్ల వెంకట్‌రెడ్డి భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న మంత్రి జగదీష్‌రెడ్డి

నాగారం : మండల పరిధిలోని నాగారంబంగ్లా గ్రామానికి చెందిన గుంటకండ్ల వెంకట్‌రెడ్డి మంగళవారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ సందర్భంగా మృతుడి భౌతికకాయాన్ని మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి, ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్‌లు సందర్శించి నివాళులర్పించారు. అలాగే డి.కొత్తపల్లి గ్రామ సర్పంచ్ యారాల నర్సింహారెడ్డి తండ్రి యారాల రవీందర్‌రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో గుంటకండ్ల రామచంద్రారెడ్డి, వైస్‌ఎంపీపీ గుంటకండ్ల మణిమాల, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కల్లెట్లపల్లి ఉప్పలయ్య, రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ గుండగాని అంబయ్య, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ యారాల రాంరెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు గుంటకండ్ల ముకుందారెడ్డి, దోమల బాలమల్లు, కుంభం కర్ణాకర్, చిల్లర చంద్రమౌళి, పాదిల రమేష్, బెల్లి సైదులు, ఈదుల కిరణ్, మాల్యాల అశోక్, బోయిని లింగమల్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులను అభినందించిన ఎమ్మెల్యే


తిరుమలగిరిలో క్రీడాకారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్

తుంగతుర్తి : మధ్యప్రదేశ్‌లో వరల్డ్ కబడ్డీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్–19 జాతీయ కబడ్డీ పోటీల్లో మండలం నుంచి ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను మంగళవారం ఎమ్మెల్యే గాదరి కిశోర్ కుమార్ అభినందించారు. మండల పరిధిలోని వెంపటి గ్రామానికి చెందిన కొండగడుపుల చందు, భాషబోయిన ప్రవీణ్, రావులపల్లికి చెందిన గుగులోతు సంతోష్‌లు ఫైనల్లో మహారాష్ట్రతో తలపడి తెలంగాణకు ద్వితీయ బహుమతి తీసుకొచ్చారు. దీంతో ఈ నెల–21న నేపాల్‌లో జరిగే అంతర్జాతీయ కబడ్డీ క్రీడలకు ఎంపిక కావడం పట్ల ఎమ్మెల్యే హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హరీష్, మురళి, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నాయీ బ్రాహ్మణ సేవా సంఘం కమిటీ ఎన్నిక


నూతన కమిటీ సభ్యులు

అర్వపల్లి : నాయీ బ్రాహ్మణ సేవా సంఘం (హెయిర్ సెలూన్స్) నూతన కమిటీని మంగళవారం అర్వపల్లిలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మూడవసారి అధ్యక్షుడిగా ముత్యాల బుచ్చిబాబు ఎన్నికయ్యారు. అలాగే కార్యదర్శిగా గుంటి రవికుమార్, కోశాధికారిగా వేముల శివ, ఉపాధ్యక్షుడిగా చల్లా సత్యనారాయణ, సహాయ కార్యదర్శిగా చల్లా శ్రీనివాస్, గౌరవాధ్యక్షుడిగా వేముల శ్రీకాంత్‌లను ఎన్నుకున్నారు. సభ్యులుగా రామగిరి నర్సింహ, వేముల నర్సయ్య, వేముల కృష్ణయ్య, వేముల సత్తయ్య, చల్లా విజయ్, చల్లా సందీప్, వేముల రమేష్‌లు ఎన్నికయ్యారు.

ఆర్థికసాయం అందజేత


అర్వపల్లి : మృతురాలి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

అర్వపల్లి : కాసర్లపహాడ్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ వేముల గణేష్ తల్లి, సీనియర్ నాయకురాలు భద్రమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. అయితే మంగళవారం బీఆర్‌ఎస్వీ మండల ప్రధాన కార్యదర్శి ఉయ్యాల రాముగౌడ్ రూ. 8 వేలు, మండల నాయకుడు మాదగాని మహేష్ రూ.5 వేలు ఆర్థికసాయాన్ని మృతురాలి కుటుంబీకులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన డైరెక్టర్ మెండె సురేష్, లొడంగి లింగరాజు, పండుగ నాగరాజు, దావుల సతీష్ పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బియ్యం అందజేత

తిరుమలగిరి : తిరుమలగిరిలోని అంబేద్కర్‌నగర్‌కు చెందిన ఊడుగు లక్ష్మమ్మ ఇటీవల కారు ప్రమాదంలో మృతి చెందారు. దీంతో మృతురాలి కుటుంబానికి లయన్స్ క్లబ్ సభ్యులు మంగళవారం 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మంద పద్మారెడ్డి, కార్యదర్శి కందుకూరి లక్ష్మయ్య, కోశాధికారి సురేష్, వెంకటేశ్వర్లు, విశ్వేశ్వర్‌రావు, రామచంద్రుగౌడ్, యాదగిరి, రోశయ్య పాల్గొన్నారు.

రామలింగయ్య కుటుంబానికి పరామర్శ


మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న అన్నెపర్తి జ్ఞానసుందర్

అర్వపల్లి : మండల పరిధిలోని బొల్లంపల్లి గ్రామానికి చెందిన డ్రైవర్ పసుల రామలింగయ్య ట్రాక్టర్ కిందపడి మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి అన్నెపర్తి జ్ఞానసుందర్ మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబానికి రూ. 5వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకుడు కుంభం ప్రవీణ్‌గౌడ్, ఉపసర్పంచ్ కేసాని రామనర్సయ్య, నిమ్మనగోటి సురేష్, పంది సురేందర్, ధనమ్మ పాల్గొన్నారు.

కట్టెలు కోసే మిషన్ అందజేత


రెడ్డి సేవా సంఘం సభ్యులకు కట్టెలు కోసే మిషన్‌ను అందజేస్తున్న దాత నాగిరెడ్డి

నూతనకల్ : దహన సంస్కారాల సమయంలో కట్టెలను కొయ్యడం కోసం కటింగ్ మిషన్‌ను దాత బాణాల నాగిరెడ్డి మంగళవారం ఆదర్శ రెడ్డి సేవా సంఘానికి అందించారు. ఈ సందర్భంగా రెడ్డి సేవా సంఘం అధ్యక్షుడు కొమిరెల్లి విఠల్‌రెడ్డి మాట్లాడారు. దహన సంస్కారాల సమయంలో కట్టెలను సమకూర్చడం కోసం కటింగ్ మిషన్ లేక ఇబ్బందులు ఎదుర్కొంటుండగా దాత మిషన్‌ను అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ రెడ్డి సేవా సంఘం కార్యదర్శి బద్దం లింగారెడ్డి, పన్నాల మల్లారెడ్డి, బద్దం వెంకట్‌రెడ్డి, యాస శ్రీనివాస్‌రెడ్డి, చిలుముల గంగారెడ్డి, యాస ఉప్పల్‌రెడ్డి, దేవిరెడ్డి వెంకట్‌రెడ్డి, మాదిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, సామ ఉపేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం

చిలుకూరు : తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సునీత అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ కవిత, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, నాగమ్మ పాల్గొన్నారు.

నేచురోపతి వైద్యశాలను ఏర్పాటు చేయాలి


వేణుగోపాలచారికి వినతిపత్రం అందజేస్తున్న నేచురోపతి వైద్యులు

అర్వపల్లి : ప్రతి నియోజకవర్గానికి ఒక నేచురోపతి వైద్యశాలను ఏర్పాటు చేయాలని కోరుతూ నేచురోపతి వైద్యులు మంగళవారం హైదరాబాద్‌లో తెలంగాణ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ చైర్మన్, తెలంగాణ ప్లానింగ్ కమిషన్ సభ్యుడు డాక్టర్ ఎస్. వేణుగోపాలచారిని కలిసి వినతిపత్రం అందజేశారు. నేచురోపతి వైద్యశాలలకు ప్రకృతి వైద్య కోర్సు పూర్తిచేసిన డాక్టర్లను నేచురోపతి వైద్యులుగా నియమించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే నేచురోపతి వైద్య కళాశాల విభజన ప్రక్రియను వెంటనే పూర్తిచేసి తెలంగాణ అభ్యర్థులకు ఉద్యోగాల నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర నేచురోపతి వైద్యుల సంఘం గౌరవ అధ్యక్షుడు డాక్టర్ రాజీవ్‌ఆనంద్, రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చినపాక మణిరత్నం, డాక్టర్ మోహనశైలజ, డాక్టర్ అనిల్ పాల్గొన్నారు.

అంటు వ్యాధులు వ్యాప్తి చెందకుండా చూడాలి

సూర్యాపేట రూరల్ : గ్రామాల్లో పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, అంటువ్యాధులు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాసరావు అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టర్, ఎస్‌ఎల్‌బీసీ ఆదేశాల మేరకు మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులకు ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో ప్రగతి, బృహత్, పల్లె ప్రకృతి వనాలు, తెలంగాణ క్రీడా ప్రాంగణాలను పరిశీలించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ కిరణ్మయి, ఎంపీఓ పరంకుశరావు, ఏఓ జానిమియా, ఏఈ భరత్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి


మాట్లాడుతున్న బొంకూరి శ్రీనివాస్

తుంగతుర్తి : కార్మికుల సంక్షేమానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషి చేస్తోందని భవన నిర్మాణ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు బొంకూరి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ధనలక్ష్మి ఫంక్షన్‌హాల్లో నిర్వహించిన మండల భవన నిర్మాణ వర్కర్స్ యూనియన్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వాలు కార్మికులను విస్మరించాయని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన త్వరాత కార్మికుల కోసం రూ.5లక్షల ప్రమాదబీమాతో పాటు ఇతర సౌకర్యాలు కల్పించిందని తెలిపారు. ప్రతి కార్మికుడు లేబర్ కార్డు కలిగి ఉండాలన్నారు. ఈ నెల 5న మండల కేంద్రంలో జరిగే బీఆర్‌ఎస్‌కేవీ మండల భవన నిర్మాణ వర్కర్స్ యూనియన్ ఆత్మీయ సమావేశానికి కార్మికులు అత్యధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్‌కేవీ నాయకులు కుంభం మహేష్ గౌడ్, వడ్లకొండ కొమరయ్య, పోలేపాక రాజేష్, వీరస్వామి, మాచర్ల వేణు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డులో చెత్తా చెదారం తొలగింపు


తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్‌లో చెత్తా చెదారం తొలగిస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

తిరుమలగిరి : తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం చెత్తా, చెదారం తొలగించి శుభ్రపరిచారు. గత నెల 22న సాక్షి దినపత్రికలో అపరిశుభ్రంగా వ్యవసాయ మార్కెట్ యార్డు అనే కథనం ప్రచురితమైంది. చెత్తా, చెదారంతో దుర్గంధం వెదజల్లుతుందని, మార్కెట్ యార్డులో మద్యం సేవించి సీసాలు పగులగొడుతున్నారని కథనం రావడంతో వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్ కొమ్మినేని స్రవంతిసతీష్‌కుమార్ ఆదేశానుసారం సిబ్బంది చెత్తా, చెదారం, పాడుబడ్డ ఫ్లెక్సీలను తొలగించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొమ్మినేని సతీష్‌కుమార్, మార్కెట్ సూపర్‌వైజర్లు అల్తాఫ్, అష్మా, సిబ్బంది చిన్ని, యాకయ్య, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వర్షాకాలం.. జీవాలు భద్రం

- జీవాలకు గాలికుంటు వ్యాధి సోకే ప్రమాదం
- గ్రామాల్లో టీకాల పంపిణీని ప్రారంభించిన పశువైద్యసిబ్బంది


జీవాలకు టీకాలు వేస్తున్న పశువైద్యసిబ్బంది (ఫైల్)

ఆత్మకూరు (ఎస్) : వర్షాకాలం సీజన్‌లో జీవాలకు వివిధ వ్యాధులు సంక్రమించే ప్రమాదం ఉంటుంది. ముఖ్యంగా గాలికుంటు వ్యాధు సోకి జీవాలు కదలలేవు. కనీసం ఆహారం కూడా తీసుకునే పరిస్థితి ఉండదు. దీంతో ఈ వ్యాధి నివారణ కోసం అన్ని గ్రామాల్లోనూ పశువైద్యసిబ్బంది సామూహిక శిబిరాలు ఏర్పాటు చేసి గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నారు. ఆత్మకూరు మండలంలో రెండు టీంలతో 25 రోజులపాటు అన్ని గ్రామ పంచాయతీల్లోను టీకాలు వేయనున్నారు.

ఆత్మకూరు మండలంలో గ్రామాల వారీగా ఇలా..

ఆగస్టు 1వ తేదీన కందగట్ల గ్రామంలో ఈ టీకాల కార్యక్రమం ప్రారంభమైంది. 2న మంగళితండా, భజనతండా, 3న గట్టికల్, 4న పీపానాయక్‌తండా, కర్నోనితండా, 5న నెమ్మికల్, 7న పాతసూర్యాపేట, 8న శంకన్నగూడెం, పాశంబండతండా, 9న కోటినాయక్‌తండా, దుబ్బతండా, 10న బోరింగ్‌తండా, బాపూజీతండా, 11న కొత్తతండా, లక్ష్మాతండా, 12న పాతర్లపహాడ్, 14న ఇస్తాళపురం, 16న ఏనుబాముల, 17న దాచారం, 18న నశీంపేట, 19న రామోజీతండా, 21న నంద్యాలగూడెం, ఫుప్పాలగూడెం, 22న ఆత్మకూర్ (ఎస్), 24న కాల్‌భావ్‌సింగ్‌తండా, వీరునాయక్‌తండా, 25న కృష్ణసముద్రం, దాచారం, 26న కందగట్ల, నెమ్మికల్, 28న గట్టికల్, పాతర్లపహాడ్ గ్రామాల్లో సామూహిక గాలికుంటు టీకాలు వేయనున్నారు. ఇక 29, 30తేదీల్లో ఆయా గ్రామాల్లో మిగిలిన జీవాలకు టీకాలు వేస్తారు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



ఈ సీజన్‌లో పశువులు, జీవాలకు గాలికుంటు వ్యాధి సోకే అవకాశముంటుంది. రైతులు నష్టపోకుండా ఉండేందుకుగానూ ప్రభుత్వం ఏటా ఈ వ్యాధి నిరోధక టీకాలు అందిస్తోంది. ఈ క్రమంలో ఈ వానాకాలం ఆగస్టు 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు టీకాలు వేయనున్నాం. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– వేణుగోపాల్‌రావు, మండల పశువైద్యాధికారి

పరీక్ష తేదీలు మార్చాలి

నూతనకల్ : రాష్ట్రంలో నిర్వహించనున్న గ్రూప్–2 పరీక్ష తేదీలను మార్చాలని బీసీ విద్యార్థి యువజన సంఘం జిల్లా నాయకుడు కొలిచెల్మ తరుణ్‌కుమార్ కోరారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 29, 30 తేదీల్లో నిర్వహించే గ్రూప్–2 పరీక్షల రోజున ఇతర పరీక్షలు ఉన్నందున అభ్యర్థులు పరీక్షలకు హాజరయ్యే పరిస్థితి లేదన్నారు. ఇతర పరీక్షలు లేని రోజుల్లో గ్రూప్–2 పరీక్షలు నిర్వహించాలని కోరారు.

పాతర్లపహాడ్ పాఠశాలలో పఠనోత్సవం

ఆత్మకూర్ (ఎస్) : మండల పరిధిలోని పాతర్లపహాడ్ ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం పఠనోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కేశబోయిన మల్లయ్య నాలుగో తరగతి పాఠ్య పుస్తకాన్ని పఠనం చేసి విద్యార్థులతో చదివించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ధారాసింగ్, ప్రధానోపాధ్యాయుడు వీరారెడ్డి, ఉపాధ్యాయులు నర్సయ్య, కరుణాకర్, పద్మ, బాలచందర్, వార్డు మెంబర్ రావుల భద్రయ్య పాల్గొన్నారు.


పఠనోత్సవంలో పాల్గొన్న సర్పంచ్, విద్యార్థులు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


చివ్వెంలలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కళాబృందం సభ్యులు

చివ్వెంల : వర్షాకాలం సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ సాంస్కృతిక కళాబృందం ఆధ్వర్యంలో మంగళవారం చివ్వెంల మండల కేంద్రంలో ప్రజలకు అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధులు ప్రభలకుండా ప్రజలు ఇళ్ల పరిసరాలను, వీధులను శుభ్రంగా ఉంచుకోవాలని వివరించారు. తడి, పొడి చెత్తను వేరు చేసి, గ్రామ పంచాయతీ ట్రాక్టర్ ద్వారా తరలించాలని సూచించారు. వేడి చేసి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని, నీరు నిల్వకుండా చూసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ వేముల నరేష్, గంట భిక్షపతి, శంకర్, సాయి, సుధాకర్, పల్స నిర్మల, స్రవంతి, రాధ, ప్రియదర్శిని, ఇందిర, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

బాటసారులకు అల్పాహారం పంపిణీ


అల్పాహారం పంపిణీ చేస్తున్న గండూరి కృపాకర్

భానుపురి : అభివృద్ధి చేసే వారిని ప్రజలు ఎల్లప్పుడూ ఆదరించాలని, సూర్యాపేట నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్న మంత్రి జగదీష్ రెడ్డిని మళ్లీ గెలిపించాలని పట్టణ క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, టీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు గండూరి కృపాకర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని కొత్త బస్టాండ్ ఫ్లై ఓవర్ వద్ద 300 మంది బాటసారులకు అల్పాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కలకోట లక్ష్మయ్య, రాచకొండ శ్రీనివాస్, బజ్జూరి శ్రీనివాస్, సతీష్ కుమార్, వెంకటేష్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఎన్‌సీసీ సర్టిఫికెట్లు


సర్టిఫికెట్లు ఇస్తున్న 31వ బెటాలియన్ క్యాడెట్లు

సూర్యాపేట రూరల్ : ఇమాంపేట ఆదర్శ పాఠశాలలో 8వ తరగతికి చెందిన పలువురు విద్యార్థులను తెలంగాణ 31వ బెటాలియన్ ఎన్‌సీసీ నల్లగొండ ఆధ్వర్యంలో ఎన్‌సీసీ పూర్తి చేసినట్లు పాఠశాల ప్రిన్సిపల్ శంకర్ నాయక్ మంగళవారం తెలిపారు. ఫిబ్రవరిలో ఎన్‌సీసీఏ సర్టిఫికెట్ పరీక్షలో ఉత్తీర్ణలైన క్యాడెట్స్‌కు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో 31వ బెటాలియన్ ఎన్‌సీసీ నల్లగొండ సుభేదార్ చామకూర్‌సింగ్, హవల్దార్ తర్సమ్‌లాల్, పాఠశాల ఎన్‌సీసీ ఎస్‌ఏ రాజయ్య, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలగా గుర్తించాలని వినతి


అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

దురాజ్‌పల్లి : జిల్లా కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర ఎయిడెడ్ డిగ్రీ కళాశాలను ప్రభుత్వ కళాశాలగా మార్చాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పాలెబోయిన కిరణ్‌కుమార్ కోరారు. మంగళవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ ఎ. వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందించి మాట్లాడారు. అమరావతి వెంకట నరసయ్య 82 ఎకరాల భూమిని కాలేజీకి ఇచ్చారని, ఈ కళాశాల 1971లో ప్రారంభమై 52 సంవత్సరాలుగా నడుస్తోందన్నారు. కళాశాలలో ఒక సంవత్సరానికి సుమారు 1600 మంది విద్యార్థులు చదువుతున్నారని తెలిపారు. కళాశాలలో సెల్ఫ్ ఫైనాన్స్ విధానాన్ని పెట్టడం మూలంగా పేద విద్యార్థులు ఫీజులు కట్టలేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రభుత్వం చొరవ తీసుకొని ఎస్వీ కళాశాలను ప్రభుత్వ కళాశాలగా ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ డివిజన్ కార్యదర్శి పిడమర్తి భరత్, దుదీపాల ప్రవీణ్, బట్టిపల్లి పరమేష్, వేణు, ప్రశాంత్, పాల్గొన్నారు.

పథకాలపై ఇంటింటి ప్రచారం

నడిగూడెం : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాలపై మంగళవారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా రైతు బీమా, రైతు బంధు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, ఉచిత విద్యుత్, పలు పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ.జలీల్, జానిమియా తదితరులు పాల్గొన్నారు.

సొంత జిల్లాల్లో కేటాయించాలి

ఆత్మకూర్ (ఎస్) : ఆగస్టు 1 నుంచి జరుగనున్న గురుకుల టీజీటీ, పీజీటీ, జేఎల్ పరీక్షలకు దివ్యాంగుల కోసం సొంత జిల్లాల్లోనే పరీక్ష కేంద్రాలను కేటాయించాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ.జహీర్‌బాబా డిమాండ్ చేశారు. హైదరాబాద్, వేరే జిల్లాలకు వెళ్లి పరీక్షలు రాయడానికి దివ్యాంగులు ఇబ్బందులు పడుతారని అన్నారు.

శ్రీలక్ష్మీనర్సింహస్వామి హోమం


హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

చివ్వెంల : ఉండ్రుగొండ గ్రామ శివారులోని గిరిదుర్గంలో వెలిసిన శ్రీ లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో అధిక శ్రావణ మాసం సందర్భంగా ప్రత్యేక హోమం నిర్వహించారు. వేద పండితులు మంత్రోచ్ఛరణతో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చకిలం క్రిష్ణ కుమార్, బండకవి మోహన్, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

నారాయణగూడెం వాసికి డాక్టరేట్


మధు

పెన్‌పహాడ్ : నారాయణగూడెం గ్రామానికి చెందిన నకిరేకంటి మధు ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పట్టా పొందాడు. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్‌లో డీప్ లెర్నింగ్ బేస్డ్ డేటా ఎనాలసిస్ ఫర్ సెక్యూర్ ఆన్‌లైన్ సోషల్ నెట్వర్క్ ఫ్రేమ్ వర్క్ అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని సమర్పించగా యూనివర్సిటీ వారు తనకు డాక్టరేట్ అవార్డును అందించినట్లు అవార్డు గ్రహీత తెలిపారు. డాక్టరేట్ రావడానికి సహకారం అందించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

పంచాయతీ కార్మికుల డిమాండ్లను నెరవేర్చాలి


అర్వపల్లిలో పంచాయతీ కార్మికుల సమ్మెకు మద్దతు తెలుపుతున్న బీఎస్పీ నాయకులు


తిరుమలగిరిలో సమ్మె చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు

అర్వపల్లి : గ్రామ పంచాయతీ కార్మికులను వెంటనే క్రమబద్ధీకరించి వారి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని బీఎస్పీ జిల్లా సీనియర్ నాయకుడు దాసరి శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని కోరుతూ గ్రామ పంచాయతీ కార్మికులు నిర్వహిస్తున్న సమ్మెకు మంగళవారం బీఎస్పీ ఆధ్వర్యంలో మద్దతు తెలిపి సమ్మెలో కూర్చున్నారు. అనంతరం తహసీల్దార్ యాదగిరిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ మండల అధ్యక్షుడు చెరుకుపల్లి లక్ష్మణ్, నియోజకవర్గ అధ్యక్షుడు మల్లెపాక వెంకటేష్, శతకోటి కోటేశ్వర్లు, జీడి వెంకన్న, జీడి సరోజ, కార్మికుల సంఘం మండల అధ్యక్ష, ఉపాధ్యక్షులు జీడి కృష్ణ, కన్నెబోయిన శ్రీశైలం, గుగులోతు నాగులునాయక్ పాల్గొన్నారు.

27వ రోజుకు చేరిన జీపీ కార్మికుల సమ్మె

తిరుమలగిరి : తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని గ్రామ పంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మె మంగళవారం 27వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మికులందరినీ రెగ్యులరైజ్ చేయడంతో పాటు జీఓ 60 ప్రకారం వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బక్కయ్య, నాగయ్య, రాజు, శోభ, సైదులు, నాగన్న, మహేష్, రమేష్, సైదమ్మ, యాకయ్య, సుధాకర్, రాజు పాల్గొన్నారు.

ఆత్మకూర్ (ఎస్) : తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలంటూ గ్రామ పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె మంగళవారం కొనసాగింది. ఈ సమ్మెకు తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర కార్యదర్శి నల్లెడ మాధవరెడ్డి మద్దతు తెలిపి మాట్లాడారు. మల్టీపర్పస్ విధానాన్ని వెంటనే రద్దు చేసి పనికి తగ్గ వేతనాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రజాఫ్రంట్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌కే.అబ్దుల్‌కరీం, నాయకులు బుద్ధా సత్యనారాయణ, చామకూరి నర్సయ్య, ఆవుల నాగరాజు, నజీర్, కునుకుంట్ల సైదులు, నాగిరెడ్డి, సందీప్, వెంకన్న పాల్గొన్నారు.

నూతనకల్ : గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కారోబార్‌ల సంఘం జిల్లా నాయకుడు పెద్దింటి రామచంద్రారెడ్డి, నకిరేకంటి శంభయ్య డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట సమ్మెలో పాల్గొని నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.


ఆత్మకూరులో జీపీ కార్మికుల సమ్మెకు మద్దతు తెలుపుతున్న నాయకులు


నూతనకల్ : సమ్మె చేస్తున్న పంచాయతీ కార్మికులు